

## అమాయకపు ఆలోచనల

# అల్పానందం

పాలగుమ్మి విశ్వనాధం


శర్మ తలపైకెత్తి గడియారం వేపు చూశాడు.

ఐదు కొట్టడానికి ఇంకా అయిదునిమిషాలు ఉంది. అవేళ ఒకటో తారీఖు. శర్మకి ఇంక పనిమీద బుద్ధి లేదు. ఫైల్సు కట్ట కట్టేసి సొరుగులో పెట్టేశాడు. మిగతా గుమాస్తాలంతా అప్పుడే కదిలే ధోరణిలో ఉన్నట్టు కనిపించలేదు. టైప్‌రైటరు ఒకేగతిలో నడుస్తున్నాయ్. డవాలీ బంట్రోతులు, గుమాస్తాల పక్కన ఉన్న '్రేట్'లలో కాగితాలు నింపుతున్నారు అక్షయంగా. కొంచెం దూరంలో ఉన్న మేనేజర్ గదిలోంచి ,ఎదురుగా ఉన్న'డిప్యూటీ' గదిలోంచీ, వీటి రెంటికీ పైన ఉన్న చీఫ్' గదిలోంచీ 'కాలింగ్‌బెల్' ఒకదాని అధికారాన్ని ఇంకోటి మింగేస్తూ వాటి వాటి హోదాల్లో వినిపిస్తున్నాయ్.

శర్మ సీటులోంచి లేచి బయట వరండాలోకి వచ్చాడు. ఒక్కసారి బీచ్ గాలి అతని శరీరాన్నితాకి ఆఫీస్ మత్తుని కొంచెం ఒదిల్చింది. దూరాన్ని గంటస్తంభం తీరుబడిగా ఒక్కొక్క గంటా ఒక్కొక్క స్వరంతో, ఐదు గంటలు కొట్టింది. జనం తీరుబడిగా సముద్రంవేపు నడుస్తున్నారు. అమెరికన్ లిమోజైన్స్, నిండు గర్భిణీలలాగ,మందగా, బరువుగా ప్రాకుతూ పోతున్నాయి.చప్పుడు చెయ్యకుండా వాతావరణం అంతలోనూ తీరుబడి ప్రాకుతోంది.,

శర్మ ఆఫీసు వరండాలోంచి ఈదృశ్యంచూస్తూ నిల్చుండి పోయాడు. ఇది రోజూ సాయంకాలం 5 గంటలకి కనిపించే దృశ్యమే. కాని ఇవేళ శర్మకి ఎందుకో కొత్తగా అనిపించింది. ఆవేళ ఒకటో తారీకు. ఆరోజుకి ఓ ప్రత్యేకత ఉంది. ఆ ఒక్క రోజు అయినా తనుకాస్త నాగరిక ప్రపంచంలో మానవుడిలా బ్రతకాలి. అయిదు దాటిన తర్వాత తను ఆఫీసు పని ఎందుకు చెయ్యాలో వెనకనించి ఎవరో పిలుస్తున్నారు. కాషియర్'గొంతులాఉంది.

కాషియర్ గదిలోంచి బయటకి వచ్చాక జీతాన్ని రెండు మూడుసార్లు లెక్కచూచుకుని పదిరూపాయలనోట్లు ఏడూ,కోటులోపలిజేబులో పెట్టి, విడిగా ఉన్న నాలుగు రూపాయలు,చిల్లర పై జేబులో పెట్టుకుని శర్మ ఆఫీసు ఆవరణ దాటి బయటకు వచ్చాడు. ఓ తెర సముద్రం గాలి అతని ఆలోచనల్ని లేపింది. కోటు జేబులోంచి రెండు మూడు పళ్లు విరిగి పోయిన దువ్వెన తీసి జుట్టు అటూ ఇటూ రేపి, బట్ట తల అవుతున్న తలమధ్య భాగం మీదకి జుట్టు సర్దేశాడు.సముద్రపు గాలికి బొత్తాములు పెట్టనికోటువెనక్కి లేచిపోతోంది. వారగోచీపోసి కట్టిన పంచెకాళ్ళకి అడ్డాలు పడుతోంది. వెధవ పంచెలు! సూట్



# మందికోసం!

— పి. ఎస్. రావు

వేస్తే! తనకి సూట్ నప్పు దన్నారు. ఈ తీరని సూట్ కోరిక అతన్ని వెంటాడుతూనే ఉంది.

శర్మ పేవ్ మెంట్ ప్రక్కన ఉన్న సిమెంట్ బెంచీ మీద చతికిల బడ్డాడు. మనస్సులోనే ఆనెల బడ్జట్ వేయడం ఆరంభించాడు. ఏమైనాసరే ఈనెల ఇరవై రూపాయలు మిగల్చాలి. అతని ఆలోచనలకు అంతరాయం కలిగింది. 'బర్' మని సడన్ బ్రేక్ వేసిన చప్పుడుతో ఒక కారు తనికి దగ్గరలో ఆగింది. ఆకారులోంచి ఒకగుంపు ఆడా, మగా దిగారు వాళ్ళ వెనకాలే ఒక 'ఆల్సేషియన్' ముందు సీట్లోంచి క్రిందికి దూకి అక్కడ ఉన్న పూలమొక్కల్ని వాసన చూస్తో వ్నైరిగా అటు ఇటూ పరుగెడుతోంది. కారణం లేకుండానే అంతా నవ్వుతున్నారు. ఆపంజాబీ వేషంలో ఉన్న అమ్మాయి మరీ పగలబడి నవ్వుతోంది. తెల్లని దుస్తుల్లో మంచి పోషణలో పెరిగిన ఆశరీరాలు, చీకూ చింతాలేని ఆ నవ్వులు శర్మని ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఆవాతావరణంలో తను నప్పినట్లు అనిపించలేదు. శర్మ బెంచి మీదనుంచి లేచి పేవ్ మెంట్ వెంబడే శాంథోమ్ వేపు నడక సాగించాడు. వెనకనించి ఇంకానవ్వులు వినిపిస్తున్నాయి. ఈసముద్రంగాలి అందర్నీ పిచ్చి ఎత్తిస్తోంది అనుకున్నాడు. తను కూడా మనస్సు పట్టుతప్పి అల్లా కులాసాగా నవ్వి ఎన్నాళ్లయిందో! కమ్మని కాఫీ వాసన శర్మ నాసికా పుటాల్ని తాకింది. అప్పుడే వచ్చిన మొబైల్ కాంటీన్‌వ్యాన్ లోంచి మంగుళూరు సర్వర్సు యంత్రాల్లాగ, మడత కుర్చీలనీ బల్లలనీ ఇసుకలో అమరుస్తున్నారు. ఓకప్ కాఫీ వేస్తే?—అబ్బే ఇక్కడ కప్ మూడణాలు పుచ్చుకుంటాడు. కొంచెం దూరంవడిస్తే ఆనంద విలాస్‌లో ఆరుకాన్లకే తాగచ్చు. అనవసరంగా ఇంకో ఆరుకానులు ఎందుకు కర్చుపెట్టాలి, మనస్సుని క్రమశిక్షణలో పెట్టాలి. ఏమైనాసరే తను అనుకున్న ప్రకారం ఈనెల ఇరవై రూపాయలు మిగల్చ వలసిందే.'' అనుకున్నాడు.

తిరిగి శర్మ నడక సాగించాడు. ఒక జన ప్రవాహం రోడ్ అడ్డంగా దాటుతోంది. అవతలకార్లు ఇవతల కార్లు ఒకేసారి హారన్లు మోగిస్తున్న హాయంగా నిలబడి పోయాయి. జన ప్రవాహం మాత్రం ఏ తొందరా లేకుండా రోడ్ దాటబీచ్ ఇసుకలో ఇంకి పోతోంది. పరిగ్నానాలుగేళ్ళక్రితం



అదే చోటులో తనమనస్సుని ముంచెత్తిన ఆలో చనలన్నీ తిరిగి గుబురుకున్నాయి.

నాలుగు సంవత్సరాల క్రితం తన ఇంటర్‌పరీక్షలు అయాక సేసవి సెలవల్లో మొదటి సారిగా మద్రాసు వచ్చాడు. శర్మ తను పుట్టిన తర్వాత ఉన్నవూరు విడిచి ఎక్కడికీ వెళ్ళలేదు. చిన్నప్పటినుంచీ మేనమావ దగ్గరే పెరిగాడు అక్కడే హైస్కూలు, కాలేజీ ఉండడంవల్ల అధమం చదువు కోసమైనా ఇంకోవూరు వెళ్ళవలసిన అవసరం లేకపోయింది. చివరికి ఆవేసవి సెలవల్లో మేనమావ ఏదో పనిమీద మద్రాసు వెడుతూ తనని కూడా తీసుకు వెళ్లాడు.రాత్రి మెయిల్లో సరిగా నిద్రలేకపోవడం మూలాన్ని భోజనంచేసి పడుకుని ఆలస్యంగా లేచాడు.మేనమావ పనిమీద బయటికి వెళ్లాడు. కాఫీఅయిన తర్వాత సాయంకాలం ఒక్కడూ బీచికి బయలుదేరాడు. తృప్తిగా పట్టిన నిద్రలో అలసట తీర్చుకున్న శరీరానికి సముద్రపుగాలి హాయిగా తగిలింది. నిద్రమత్తు పూర్తిగా వదలిన శరీరాన్ని కాళ్ల ఇసుకలోకి లాక్కు పోయాయి. నీటిఅంచు దాకా వెళ్ళి నుంచున్నాడు. ఒక పెద్ద కెరటంవచ్చి తన పైజామానీ, 'సమ్మర్ కంఫర్టుబూటుని' తడిపి వెళ్ళి పోయింది. బూట్లనిండా ఇసక దూరింది.బూట్లు విప్పి చేత్తో పట్టుకుని, నీటి అంచునే మెత్తటి ఇసకలోనడక సాగించాడు.సముద్రం, మెత్తటి పరుపులా పరచుకొన్న ఇసుక స్వచ్ఛమైన ఆకాశం, అందులోతాడు కనిపించకుండా వ్రేలాడగట్టిన బంతిలా చందమావ— ఈవాతావరణంలోని ప్రశాంతత అతని మనసులోకి ఇంకింది. అల్లాచీపాక్‌దాకా నడుచుకుంటూ రోడ్ ఎక్కాడు. ఎదురుగా కంటిని కొట్టొచ్చే ఎర్రరంగు భవనాలు కూడా తెల్లని వెన్నెట్లో మార్దవంగా కనిపిస్తున్నాయి. అవి గవర్నమెంట్ ఆఫీసులని అడిగి తెలుసుకున్నాడు. ఆ ఆఫీసుల్లో పని చేసేవాళ్ల ఎంత అదృష్టవంతులో అనుకున్నాడు. తనని ఆ ఆఫీసుల్లోవేటిలో అయినా సరే ఆఖరికి బంట్రోతుగా అయినా సరే ఉండనిస్తే చాలనుకున్నాడు. తనమనస్సు తీవ్రంగా పని చెయ్యడం మొదలెట్టింది. తెలియకుండానే ఓనిశ్చయానికి వచ్చేశాడు. ఎల్లాగో బి. ఎ.అనిపించుకుని,ఓచిన్న ఉద్యోగం సంపాదించుకుని, ఈబీచీ ఇసకలో దొర్లుతూ సముద్రంగాలి పీలుస్తూ జీవితం గడిపెయ్యాలి.వాళ్లవూరుతలుచుకుంటే అతని వూపిరి ఆడ లే దు. ఆ ఇరుకుసందులు,కుళ్లుకాలవలు, మేనమావ కూతురితో బాటు అరణంగా తనకి హామీ ఇచ్చిన తాలుకాఫీసు గుమాస్తాగిరీ— అమ్మో! తను ఈ ఇరుకుల్లో పడి జీవితం గడిపెయ్యాలా?తర్వాత రెండేళ్లు ఎల్లాగో గడిపేశాడు. బి. ఏ.పూర్తి అయింది. తనకి ఉన్న మామిడితోట కాస్తా అమ్మేశాడు. మేన మామకి తెలియకుండా తనకీ,మేన మామకి ఘర్షణ అయింది. తన కూతురికి వేరే సంబంధం చూసుకుంటానన్నాడు. అతనిమేనమామ. తను ఆర్రాత్రేమెయిలు ఎక్కేసిమద్రాసు వచ్చేశాడు. ట్రిప్లికేన్‌లో బీచ్‌కి దగ్గరగా ఓహోటల్ మకాం పెట్టాడు. తోట అమ్మగా వచ్చిన పన్నెండు వందల రూపాయలు బేంకీలో వేశాడు. కాలంకులాసాగాగడిచిపోతోంది. ప్రొద్దుట,సాయంకాలం బీచ్‌కివెళ్ళావాడు. రెండవఆటలకి ఇంగ్లీషు సినిమాలకి వెళ్ళేవాడు. మధ్యమధ్య ఉద్యోగపు ఆలోచన్లు వచ్చి అల్లాగే అడుక్కు వెళ్లి పోయేవి. ఆరునెల్లు జరిగి పోయాయి. ఓసారి బట్టలు కొనుక్కుందామనిబాంకీలో వంద రూపాయలు తీసుకున్నాడు. మొదటిసారిగా బాంకీ బాలన్స్ అతన్ని కలవర పెట్టింది. ఇంక మిగిలినది 200రూపాయలు అది అయేలోగా ఉద్యోగం సంపాదించాలి. పారిస్ పోయే బస్ ఎక్కి బట్టల షాపుల దగ్గర దిగాడు. బస్‌దిగి జేబులో చెయ్యి పెట్టే సరికి జేబుఖాళీ. తిరిగి వెళ్ళ డానికి కూడా డబ్బులులేవు. చుర్రు మంటున్న 11 గంటల ఎండ అతని మతిని మరింత పాడు చేసింది.పారిస్ కార్నర్ దాకా వచ్చి బీచ్ రోడ్ పుచ్చుకున్నాడు. ఇక్కడ ఎండమరీ ఎక్కువగా ఉన్నట్టుంది.చమటలు కారుతున్నాయి. తారు రోడ్ మీద ఎండ కళ్ళకి మిరుమిట్లు గొల్పుతోంది. సముద్రపు ఇసుక సెగలు గ్రక్కుతోంది. దూరంగా సముద్రం మాత్రం నిశ్చలంగా కనిపిస్తోంది. చీపాక్ దాకా వచ్చేశాడు. పేవ్‌మెంట్ ప్రక్కన గన్నేరుచెట్టుక్రింద సిమెంట్ బెంచీమీద కూలబడ్డాడు. చల్లటి సముద్రంగాలి అతన్ని ఓదార్చింది. బుర్రలో కలసి పోయిన ఆలోచనలు కొంచెం విడడం ఆరంభించాయి. ఇప్పుడేంచేయాలి బాంకీలో ఉన్న రెండు వందలు అయేలోగా ఉద్యోగం సంపాదించాలి. ఆమర్నాటినుంచీ ఉద్యోగం కోసం త్రిప్పట ఆరంభించాడు.ఉద్యోగం రావటం అంటేఅంత కష్టమని తను వూహించలే. కొంచెం కంగారు పుట్టింది.ఓనెల గడిచిపోయింది. బాంకీ బేలన్సు, డేంజర్ సిగ్నల్స్ ఇస్తోంది. భవిష్యత్‌కి హామీ ఉండాలి లేక పోతే ప్రస్తుతం వరకం. తన అదృష్టం బాగుంది. ఓ టెంపరరీ ఉద్యోగం దొరికింది. మూడు నెల్ల తర్వాత అది అయిపోయింది. అనుకుంటున్నదే కాబట్టిఅంత బాధ పడలేదు. ఈమూడు నెలల్లోనూ బాంక్ అక్కౌంట్ కొంచెం లావు ఎక్కింది. ఎవరో రాక్షసుడి ప్రాణం ఎక్కడో చిలకలో ఉంటే, తన ప్రాణం, మానం కూడా బాంకి అక్కౌంట్‌లో ఉన్నాయి. అందులోంచి ఒక్కొక్క సున్నాతగ్గితేంటే తన నవ రంధ్రాల్లో ఒక్కొక్క టేమూసుకు పోతుంటాయి. మధ్య రెండు నెలలుఖాళీగా ఉన్నాడు. ఇంకో ఉద్యోగం దొరికింది. అది నాల్గు నెలలు జంది. ఇల్లా మూడు ఏళ్ళలో 5 ఉద్యోగాలు చేశాడు. మధ్యన కాళీ వచ్చినప్పుడల్లా బుర్రలో కీచురాళ్లు రొద ఆరంభించేవి. ఇప్పుడున్న ఉద్యోగం టంపరరీదే అయినా పెర్మనెంటు ఖాయమయిందే. తను జాగ్రత్తగా పని చేస్తే ఖాయం అయిపోవచ్చు.బుర్రలో కీచురాళ్లు తనకి ఓప్ర

పంచం ఏర్పరిచాయి. బాహ్య ప్రపంచానికీ మధ్య కనిపించని గోడ ఒకటి పెరుగుతోంది. ఒకప్పుడు తను, ఈబీచ్‌నీ సముద్రాన్ని చూసి తన్మయుడయి పోయేవాడు. నాలుగేళ్ళ నుంచి తను పని చేస్తున్న ఆఫీసులన్నీ బీచ్ ఒడ్డునే ఉన్నాయి. ఆఫీసుకి వెళ్ళేప్పుడు వచ్చేప్పుడు ఏదో నిద్రలో నడుస్తున్నట్టే నడిచి వెళ్ళేవాడు. ఈబీచ్, సముద్రం ఇవి రోజూ గదిలో గోడమీద మేకుని వ్రేలాడుతూ దృష్టిని ఆకర్షించని, పాత కాలెండర్‌మీది పెయింటింగ్‌లా అయిపోయింది.

నాలుగేళ్ళ తర్వాత ఇప్పుడు శర్మకి అనుమానం తగిలింది. తనలో ఏదో చచ్చిపోతోందని. మెదడు చుట్టూ పాకుడు కట్టుతోంది. తన ఉద్యోగం, కన్‌ఫర్‌మేషన్ — మినహాయించి ఆలోచనలు వేరే ఎటూ పోయినట్టు అనిపించలేదు. శర్మ ఆలోచనల్లోంచి బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు. కాఫీ తాగలేదని గుర్తుకొచ్చింది. హాయిగా 'మొబైల్ కాంటీన్'లో తాగి ఉండవలసింది అనుకున్నాడు కాఫీ త్రాగడంలాంటి ప్రతిచిన్న విషయానికి మీనం మేషం లెక్కించడం అలవాటయిందేమిటి? ఈఅలవాటు తప్పించుకోవాలి అనుకున్నాడు. క్రమంగా చీకట్లు ప్రాకుతున్నాయి. విద్యుద్దీపాలు బీచి పొడుగునా తోరణాలు కట్టాయి. తొందరలేని గమనంతో జనం అటూ ఇటూ నడుస్తున్నారు. బొత్తాములు పెట్టని శర్మకోటు గాలికి కొట్టుకుంటోంది. రెండుచేతులతోటీ కోటు దగ్గరగా లాక్కున్నాడు. నోట్ల దొంతరలో బొద్దుగా ఉన్న కోటులోపలి జేబు అతని గుండెల్ని హత్తుకుంది. బొద్దుగా ఉండే అతని మేనమామ కూతురులీల అతని మనస్సులో మెదిలింది. లీల ఇప్పుడు ఎల్లా ఉందో! బహుశా ఈపాటికి పెళ్ళి అయిపోయి ఉండవచ్చు.

ఇంతలో లౌడ్‌స్పీకర్‌లోంచి మాటలు వినిపిస్తున్నాయి. ఎవరిదో అమ్మాయి గొంతుక— "అయ్యా లోనికి దయచెయ్యండి. మేము తలపెట్టిన ఈ 'కారిన్‌వాల్' జయప్రదం చెయ్యండి ఇందులో వచ్చిన ఆదాయం అంతా బీద విద్యార్థినుల కొరకు వినియోగింపబడుతుంది. ప్రవేశ రుసుము నాలుగు అణాలు మాత్రమే!" అంటూ చక్కటి ఆంగ్ల భాషలో ఆ అమ్మాయి అందరినీ ఆహ్వానిస్తోంది. సముద్రంగాలిలో తేలుకుంటూ వచ్చి ఆఅమ్మాయి గొంతు శర్మని చక్కలిగింత పెట్టిపోయింది. శర్మ అటు వేపు చూశాడు. అదిస్త్రీల కళాశాల. బయటకార్ల బారులు తీర్చి నిలబడి ఉన్నాయి. లోపల ఆవరణలోని చెట్లఆకుల్లోంచి రంగు రంగుల బల్బులు వెలుగుతున్నాయి. జనం తండోప తండాలుగా లోపలికి పోతున్నారు. పావుగంట తర్జన భర్జనలు అయిన తర్వాతశర్మ "పోనీ బీద విద్యార్థినులకి ఓపావలా ఇస్తేం!" అనుకున్నాడు. చిల్లర నాలుగణాలు లెక్కపెట్టి తీసి టిక్కట్‌కొని లోపలికి వెళ్ళాడు. అతనికళ్ళు జిగేలు మన్నాయి. అల్లాగే నిలబడి పోయాడు.

వెనకనుంచి వస్తున్న జనానికి తను అడ్డంగా ఉన్నానని కొంచెం సేపటికి తట్టింది. తప్పుకొని పక్కన పక్కన పచ్చికలో నుంచున్నాడు. పంజాబీ దుస్తుల మొదలు పాశ్చాత్య దుస్తుల వరకూ అన్ని వేషాల్లోనూ విద్యార్థినులు వస్తున్న జనానికి దోవ చూపుతున్నారు. ఆవరణ అంతా రంగు దీపాల కాంతిలో, అందమైనఅమ్మాయిలతో వెదజల్లబడిన పచ్చటి దోసతోటలా ఉంది. శర్మకి చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. స్కూలు అయిపోయాక ఒక్కడూ వూరు బయటికి నిర్మానుష్యంగా ఉన్న దోస తోటల్లోంచి నడిచి పోయేవాడు గాలికిఆకులు కదిలినప్పుడల్లా, పచ్చటి దోసపళ్ళు పరదాల్లోంచి తొంగి చూస్తున్నట్లు ఉండేవి. అటూ ఇటూ చూసి ఓకాయిపుణుక్కుని కొరుక్కుని తింటూ, ఆ తోటలో తిరిగేవాడు. దొంగతనంగా ఇప్పుడు ఓ దోస తోటలోకి జొరపడ్డట్టు అనిపించింది. అతనిలోని ఉత్సాహం పెల్లు బలికింది. "ఒక్క గంటలో పచ్చికమీదనుంచి జన ప్రవాహంలో కలిసి పోయాడు. 'స్టాల్స్' బారులు తీర్చి ఉన్నాయి. ఒక్కొక్క స్టాల్స్'లో ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు వచ్చి జనానికి ప్రదర్శింప బడిన వస్తువుల గురించి చెపుతున్నారు. శర్మ'జనం తక్కువగా ఉన్న ఓ'స్టాల్'లోకి నడిచాడు. నవ్వుతో ఓఅమ్మాయి తనదగ్గిరికివచ్చింది. రకరకాల ఎంబ్రాయిడరీలు, లేసు పనులు అందంగా అల్లిన చేతి రుమాళ్ళు, టేబిల్ క్లాతులు:—అన్నీ ఆకర్షణీయంగా అమర్చబడి ఉన్నాయి. ఇవన్నీ చూపిస్తూ ఆ అమ్మాయి చెప్పుకుపోతోంది. అక్కడ ఉన్న వస్తువులన్నీ కూడా ఆకాలేజీ విద్యార్థినుల చేతనే తయారు చేయబడినవనే, తాము తలపెట్టిన ఈసత్కార్యానికి, మీలాంటి సహృదయులు చూపుతున్న సహకారానికి ధన్యవాదాలు అర్పిస్తు ఈమారు మీస్నేహితులందరినీ తీసుకు రావాలనీ ఏవేమో చెప్పింది. శర్మ ఆమాటల్ని అల్లాగే త్రాగేస్తూ నించుండి పోయాడు. యాదాలాపంగా చూడడానికితీసిన పువ్వుల చేతిరుమాలు చేతిలో నలిగి పోయింది. అంత అందమైన అమ్మాయి అంత దయగా మాట్లాడగలదని అతను ఎప్పుడూ వూహించలేదు. అతని మనస్సు కృతజ్ఞతతో నిండి పోయింది. శర్మకి ఆడవాళ్ళతో పరిచయంతక్కువ. అందులో చదువుకున్న ఆడవాళ్ళతో ఎప్పుడైనా మాట్లాడవలసివస్తే, వాళ్ళముఖంలోకి చూస్తూ మాట్లాడలేక పోయేవాడు. ఎప్పుడైనా మాట్లాడితే తన ఆఫీసులో టైపిస్టుతో. అదైనాఆఫీసు పని మీదే. కాని ఆ అమ్మాయి ఎప్పుడూ కస్సుమని మాట్లాడేది. మగవాళ్లతో సహజంగా మాట్లాడితే తన భారత నారీత్వం ఎక్కడ దెబ్బతింటుందో అన్నట్టు.

"ఆరుమాలేనా, ఇంకేమైనా తీసుకుంటారా?" అని ఆ అమ్మాయి వేసిన ప్రశ్నతో అతనికి తెలివి వచ్చింది." ఆ టేబిల్‌క్లాత్ కూడా ఇవ్వండి" అన్నాడు తనకి టేబిల్ క్లాత్ వేసుకోడానికి టేబి



ళ్లేక పోయినా! నాలుగు మూలలా ఉన్న అల్లిక పనిని మెచ్చుకుంటూ, ఒకమూల గులాబీ పువ్వు మధ్య ఎర్రదారంతో చిన్న 'ఆర్' అక్షరంచూస్తూ "ఈ ఆర్ అంటే ఏమిటండీ ?"అని అడిగాడు. కుతూహలంతో.

"ఆ టేబిల్ క్లాత్ అల్లిన అమ్మాయి పేరులో మొదటి అక్షరం 'ఆర్' అండీ" అంది అతనికేసి కొంటెగా చూస్తూ.

శర్మ సిగ్గుపడిపోయి,తనలోకి ముడుచుకు పోయాడు. ఆ అమ్మాయి మామూలుగానే మాట్లాడుతోంది. కొంచెంతేరుకున్నాడు. తొందరగా టేబిల్ క్లాత్ని మడత పెట్టి పట్టుకున్నాడు. 'చేతితో పట్టుకుంటే నలిగి పోతాయి, ఈసంచీలో పెట్టుకోండి" అని ఓ చేతి సంచీకూడా బిల్ కి చేర్చింది. శర్మ దర్జాగా లోపలి జేబులోంచి పది రూపాయల నోటు తీసి ఇచ్చాడు. శర్మ చేతికి. 2 రూపాయలు, చిల్లరా, నీలపుసిరాతో కోలగా అక్షరాలతో అందంగా రాసిన రసీదు అందించింది. ధన్యవాదాలు చెపుతూ ఆ అమ్మాయితిరిగి ఇచ్చిన 2 రూపాయలు, చిల్లరా లెక్క చూడకుండానే నిర్లక్ష్యంగా జేబులో పెట్టేశాడు.

ఆ అమ్మాయి స్వదస్తూరితో వ్రాసి ఇచ్చిన రసీదు మాత్రం, జాగ్రత్తగా నాలుగు మడతలు పెట్టి భద్రంగా వేరే జేబులో పెట్టాడు, భక్తితో తాయెత్తు దాచినట్టు.

"ఇక్కడ ఎక్కడైనా కాఫీ దొరుకుతుందా అండీ ?" అన్నాడు శర్మ.

"కాఫీ ఒకటేకాదు. లైట్ రిఫ్రెష్ మెంట్సు కూడా ఉన్నాయి. మాకాలేజీ హోమ్ సైన్స్ డిపార్టుమెంటు విద్యార్థినులు నిర్వహిస్తున్నారు. కొంచెం అటు వెడితే కన్పిస్తుంది." అంది ఆ అమ్మాయి శర్మ అటువేపు నడక సాగించాడు. ఒక అమ్మాయి డబ్బుతీసుకుని కూపన్లు చింపిఇస్తోంది బల్లల మీద తిను బండారాలు అమర్చి ఉన్నాయి. ఇక్కడ ఇద్దరుఅమ్మాయిలు కూపన్లు పుచ్చుకుని కావలసినవి ప్లేట్లలో పెట్టి ఇస్తున్నారు. ఇంకో అమ్మాయి. కుళాయి తిప్పి కప్పులలో కాఫీ నింపి ఇస్తోంది. శర్మ 1 రూపాయి ఇచ్చి కూపన్లు కొన్నాడు. ఒక మైసూర్ పాక్ ఓ ప్లేట్లో కారాబూంది తెచ్చుకుని పచ్చికలో కూర్చున్నాడు. అది తిన్న తర్వాత కాఫీ త్రాగి తిరిగి స్టాల్స్ వేపు నడక సాగించాడు. ఒక్కొక్క స్టాల్లోకీ వెళ్ళాడు. చేతిలోని హేండ్ బాగ్ కొన్న వస్తువులతో నిండి పోయింది. కోటు కుడి ప్రక్కజేబు రసీదులతో నిండి పోయింది.తిరిగి లౌడ్స్పీకర్ లోంచి ఓ అమ్మాయి గొంతు వచ్చి అతన్ని నిమిరింది. "మాకాలేజీ విద్యార్థినులనృత్య ప్రదర్శనం కొద్ది నిమిషాలలో ఆరంభం అవుతుంది. రకరకాల నృత్యాలు.....మీరంతా...."

శర్మకి ఇంక మిగతా ప్రార్థన అవసరంలేకపోయింది. పాపం ఆఅమ్మాయి చేత "అల్లా అడిగించుకోడమేమిటి" అనుకున్నాడు. 5 రూపాయల టిక్కట్ కొనిముందరవరసలో కూర్చున్నాడు. తెరలేచింది. గ్రామఫోన్ మీద 'జాదూగర్సయ్యాఛోడి మేరే భయ్యా "అనే రికార్డు తిరుగుతోంది. అప్పటికి ఇద్దరు అమ్మాయిలు ఒకళ్లచుట్టూ ఒకళ్ళు తిరుగుతూ నృత్యం ఆరంభించారు.కొంచెం సేపటికి మొగవేషంలో ఉన్న అమ్మాయి మీసం వూడి పోయింది. శర్మ అందరితో పాటూ చేతులు కందిపోయేట్లు చప్పట్లు కొట్టేడు.— నోట్లో వేలు పెట్టుకుని ఈల కూడా వేద్దామని అనిపించిందిగాని కొంచెం జంకాడు. తర్వాత రకరకాల నృత్యాలు జరిగాయి. ఆఖరున స్టేజిమీద అమ్మాయిలు అందరూ ఇండియా ఆకారంతో నుంచుని వందే మాతరంపాడారు. శర్మ మత్తుగా బయటికి వచ్చేడు. దూరంగా గంటస్థంభం9 గంటలు కొడుతోంది. శర్మ బయటికి పోయే దారి వెంబడి నడక సాగించాడు. కొంచెం దూరంలో బయటికిపోయే గేటు దగ్గర ఒకడేరా వేసి ఉంది. "ఒక్కసారి నవ్విపొండి. ప్రవేశం 1 అణా మాత్రమే" అని బోర్డు కట్టి ఉంది. శర్మ టిక్కట్ కొని పరధ్యాన్యంగా లోపలికిపోయాడు. ఎదురుగా పెద్ద అద్దం లోంచి ఇంకో పెద్ద శర్మ తనకేసి నడిచి వస్తున్నాడు పరధ్యానంగానే. శర్మ పరధ్యానం ఎగిరి పోయింది.ఇంకో పక్కకి తిరిగేడు. అక్కడ ఇంకో శర్మకు దించుకుపోయి తన కేసి చూస్తున్నాడు. ఇంకో పక్కకి తిరిగేడు. ఆ అద్దంలో నుంచున్న శర్మ ముక్కు పెద్దదిగా సాగి తనదాకా వచ్చింది. కోటు జేబు ఎత్తుగా ఎదిగి పోయింది. శర్మ వ్రేళ్ళ అప్రయత్నంగా కోటు జేబులోకిపోయి. మిగిలిన నోట్లని లెక్కపెట్టడానికి ప్రయత్నించాయి.అన్ని పక్కల అద్దాలలోంచి రకరకాల శర్మలు కంగారుగా చూస్తున్నారు. తొందరగా బయటికి వచ్చి.గేటు దాటి రోడ్ మీదకి వచ్చేశాడు.ఇంటికి పోయే తొందరలో కారు హారన్లు అన్నీఒకేసారి మ్రోగుతున్నాయి. శర్మ ఈరొదలోంచి తప్పుకుని మెర్క్యూరీ లైట్ క్రింద ఉన్న సిమెంట్ బెంచిమీద కూలబడ్డాడు. హేండ్ బేగ్ పక్కన పెట్టాడు. డబ్బు ఎంత మిగిలిందో అన్నతహతహ ఎక్కువైంది. జేబులన్నీ కాళీచేసి ఒళ్ళో వేసుకున్నాడు. అమ్మాయిలు అందంగా నీలపుసిరాతో వ్రాసి యిచ్చిన రసీదుల మధ్య రెండు పదిరూపాయల నోట్లు మాత్రం నక్కి ఉన్నాయి. తనని వెక్కిరిస్తున్నట్టు. తనని అంతా మోసం చేశారనిపించింది. ఒక్క పావలాయేకదా అని లోపలికి వెళ్లాడు. లోపల జేబులో బిరబిరలాడుతున్న 7 కొత్త నోట్లలోనూ ఇప్పుడు రెండు మాత్రం మిగిలి ఉన్నాయి. ఈనెల అంతా ఎల్లాగ గడవడం అంతా తనకేసే చూస్తున్నారనిపించింది.అక్కడ నుంచి ఇసకలోకి నడిచాడు. జన సంచారం తక్కువగా ఉన్న చోట చేతిలోని హేండ్ బాగ్ క్రింద పడేసి ఇసకలో నడుం వాల్చాడు.నిస్పృహ అతన్ని ఆవరించింది. అవతల అంచుని సముద్రంలోంచి చందమామపైకి తేలు తున్నాడు. పోయిన 50 రూపాయలమిజానులె తనకి మిగిలినవి ఏమిటో అని హేండ్బాగ్లోంచి ఒక్కొక్కటే బయటికి తీశాడు. 2 టేబిల్ క్లాతులు, 4 చేతిరుమాళ్ళు ఓఅమ్మాయి వేసిన వాటర్ కలర్సు పెయింటింగ్ ఇంకా ఏవో బొమ్మలు అన్నీ బయటికి బయటికి వచ్చాయిసంచీలోంచి. తిరిగి అన్నీ సంచీలో కుక్కేశాడు.ఒక్కసారి వెర్రి కోపంవచ్చింది. జేబులోని రసీదులన్నీ తీసి విసిరేశాడు. అవి గాలికి తిరిగివచ్చి తన ముఖంమీదే పడ్డాయి.కోపంపోయి నవ్వు వచ్చింది. తన తెలివి తక్కువ తనానికి జ్ఞాపక చిహ్నంగా అవి అట్టే పెట్టుకుంటేం!కడచిన కొన్ని గంటలలో ఎంత శుంఠలా ప్రవర్తించాడు.!క్రమంగా వెన్నెల పైకి ప్రాకుతోంది. కెరటాల కోలాహలం ఎక్కువైంది. శర్మ లేచి ఒక దానివెంట ఒకటి తరుముకొని వస్తున్న కెరటాలని చూస్తూ కూర్చున్నాడు.అతనికి ఏదో జ్ఞాపకం వచ్చింది. ఎవరో ఒకాయన సముద్ర స్నానానికి వచ్చి "ఈకెరటాలు తగ్గి పోయాక స్నానం చెయ్యవచ్చు" అనుకుని కెరటాలు ఎప్పుడు తగ్గుతాయా అని కూర్చున్నాట్ట. ఈజీవితసముద్రంలో కెరటాలు తగ్గడం ఎప్పుడు?

ఆనందం అంటే ఏమిటి? దాని అర్థం వ్యక్తిబట్టి మారుతూ ఉంటుందేమో! కానినిజంగా మనిషి వాస్తవిక జగత్తునుండి స్వాప్నిక జగత్ లోకి పారి పోయిన కొన్ని క్షణాల్లోనూ ఎక్కువ ఆనందం అనుభవిస్తాడేమో! తన విషయంలో తను కడచిన రెండు మూడు గంటలు ఒక స్వాప్నిక జగత్తులో విహరించాడు. దాన్ని గురించి ఇప్పుడు ఆలోచిస్తే ఆ అనుభవం ఆనందం కూడాహరించి పోతుంది. ఒకటి మాత్రం నిజం అనితోచింది శర్మకి. తనకు జరిగే అనుభవాలను సిగ్గుపడేవాడు శుద్ధ మూర్ఖుడని. చల్లటి వెన్నెట్లో అతనిఆలోచనలు దారం తెగిన బెలూన్లలా అన్ని వేపులకి తేలిపోయాయి. అమాయక ఆలోచనల అల్పానందం అనుభవిస్తూ అతని మనస్సు కాస్త పట్లు ఒదిలింది. హేండ్బాగ్ తల క్రింద పెట్టి ఇసకలో నడుం వాల్చాడు. ఆటేబిల్ క్లాత్ మూల గులాబీ పువ్వులో కొడుతూ ఉన్న "ఆర్" అతని మనో వీధిలో పల్టీలుగా తిరుగుతోంది. "ఆర్" అంటే రాధ, లేక "రమా" .... సమాధానం దొరికేలోపలే అతనికి నిద్ర పట్టేసింది. ★